# కన్నీటి కపోతం

'బాపూ... బాపూ...' సంతోషంగా పలకరించింది కస్తూరి బాయి. దూరంగా మబ్బులపై కూర్చుని దీక్షగా రాట్నం వొడుకుతున్న గాంధీ చెవికి ఆ పిలుపు వినపడలేదు.

'నిన్నే... బాపూ... నీకో శుభవార్త...' సంతోషంగా అంది మరోసారి.

కళ్ళద్దాల్లోంచి తీక్షణంగా చూస్తూ చేతిలోని దూది కండె వదలకుండానే 'ఏమిటి సంగతి...?' అడిగారాయన.

'నువ్వు కన్న కల నిజమయింది...'

'దేని గురించి నువ్వు మాట్లాడేది?' అనుమానంగా అడిగాడు బాపు.

'నేను చెప్పింది ఏనాడు విన్నావని? ఉండు నెహ్రూను తీసుకొస్తా. ఆయన నోట వింటేనే కాని నువ్వు నమ్మవనుకొంటా. ఆయన కూడా ఆ అద్భుత దృశ్యాన్ని కళ్ళారా చూశాడు. తన మిత్రులందరికీ పటేలు, సరోజిని మొదలైన వాళ్ళందరికీ చెప్పి వస్తానని బయలుదేరాడు'

తల మీద కొంగు సర్దుకుంటూ నెహ్రూకై వెదకసాగింది.

'దీని పిచ్చిగాని యాభై ఏళ్ళ క్రితమే అసాధ్యమనుకున్నది ఇప్పుడు మాత్రం ఎలా నిజమవుతుంది?' మనసులోనే అనుకుంటూ మళ్ళీ నూలు వడకటంలో లీనమయ్యాడు.

'బాపూ...' అన్న పిలుపు వినపడగానే మళ్ళీ తలెత్తి చూశాడు. ఎదురుగా నెహ్రూ నవ్వుతూ నిల్చున్నాడు. ఎప్పటిలా తెల్లటి లాల్చీ పైజామా వేసుకున్నాడు. పోతే గులాబీ పువ్వు ఉండాల్సిన స్థానంలో పారిజాతం ఉంది. కారణం అది స్వర్గం కనుక.

'రా... నెహ్రూ...' ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకున్నాడు గాంధీ.

'ఇది విన్నారా బాపూ'

'ఏ విషయం?'

'అదే బాపు కస్తూరిబా చెప్పిన సంగతి'

'లేదయ్యా నేను వినలేదు. తనేదో చాదస్తంగా చెబుతూ ఉంటుంది. అవన్నీ వింటూ కూర్చుంటామా?' ఆయన మాట పూర్తి కాకుండానే అడ్డు పడ్డాడు నెహ్రూ.

'కాని ఇప్పుడు కస్తూరిబా చెప్పిన విషయం మాత్రం అక్షరాల నిజమయ్యా. అది చెప్పే విషయం కాదు మీరు కళ్ళారా చూసి సంతోషించే అద్భుత దృశ్యమది'

'నిజంగా అంత అద్భుతమైందా ఆ దృశ్యం'

'నిజమే బాపు. ఈ శుభ ఘడియల కోసమే మీరు కలలు కన్నది'

'అలాగా. అయితే చూద్దాం పదండి' కళ్ళజోడు సర్దుకుంటూ లేచాడు గాంధీ.

'కాని...' అంటూ నసగసాగాడు నెహ్రూ.

'ఏమైంది నెహ్రూ...?'

'ఏం లేదు. ఆ దృశ్యం చూడగానే మళ్ళీ భూమి మీదకు వెళ్తానని గొడవ చేయకూడదు'


'లేదు లేవయ్యా. ముందా సంగతేందో చూద్దాం పద...'

అందరూ ఆకాశం మీది నుండి తమ దృష్టిని భూమ్మీదకు సారించారు.

భారతదేశంలో ఆంధ్ర రాష్ట్ర రాజధాని వైపు దృష్టి నిలిపారు. గాంధీజీ చూపు సరిగ్గా ఆనలేదు. దానికి తోడు మబ్బులు అడ్డువస్తున్నాయి. కనీకనిపించక కనిపించిందా దృశ్యం. ఆ మాత్రానికే గాంధీజీ వదనాన బోసి నవ్వు విరిసింది. తన్మయంగా కళ్ళు మూసుకొని 'హే రామ్' అనుకొన్నాడు. ఆయన కళ్ళవెంట జలజలా ఆనంద బాష్పాలు రాలాయి. నెహ్రూ వైపు చూస్తూ.

'నెహ్రూ నువ్వు ఏమైనా అనుకో. నేను మాత్రం ఆగలేను. ఒక్కసారి భారతదేశానికి వెళ్ళొస్తాను' ఆవేశంగా అన్నాడు గాంధీ.

'ఇదే చిక్కొచ్చింది బాపూ నీతో. నీకు సంతోషమొస్తే ఆగలేవు కదా...?'



'లేదు. నేను వెళ్ళాల్సిందే. నాకు దేవేంద్రుడిచ్చిన వరం ఉండనే ఉంది. నే కోరుకున్నపుడు భూమి మీదకు వెళ్ళొచ్చు'

'కాని ఆ వరం కేవలం ఒక్కసారి మాత్రమే పని చేస్తుందన్న సంగతి మరచినట్లున్నారు'

'లేదు. నేను మరచిపోలేదు. నాకు బాగా జ్ఞాపకం ఉంది. నేను భారతదేశానికి వెళ్ళడానికి ఇంతకన్నా శుభ తరుణం ఏం ఉంటుంది?' ఎవరెంత నచ్చజెప్పినా వినకుండా అక్కడి నుండి అదృశ్యమైపోయాడు.

అందరూ విస్తుపోయి చూడసాగారు.

★ ★ ★

సమయం అర్ధరాత్రి వేళ...

నగరం నడిబొడ్డులో...

ఒంటరిగా నడుస్తోంది ఆమె.

రోడ్డు మీద జన సంచారం ఎక్కువగా లేదు. ఒకళ్ళిద్దరు మగాళ్ళు ఎదురుపడ్డా ఆమెను చూడగానే తలొంచుకొని దారి ఇస్తున్నారు.

**ఎం. ఉదయభాను**

దూరం నుండి ఇదంతా గమనిస్తున్న మహాత్ముడు నమ్మలేక పోతున్నాడు. తన శరీరాన్ని ఓసారి గిల్లి చూసుకున్నాడు. ఇదంతా నిజమే. కల కాదు.

తను కన్న కల నిజమైంది.

'ఏనాడైతే అర్ధరాత్రివేళ ఆడపిల్ల ఒంటరిగా తిరుగగలుగుతుందో ఆనాడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లే' అని ఆనాడు భావించాడు.

అంటే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లే. సంతోషంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు గాంధీ. ఆ అమ్మాయిని పలకరించి ఆశీర్వదించాలనుకున్నాడు.

'అమ్మాయి...' పిలిచాడు గాంధీ.

ఈ వేళలో తననెవరు పిలుస్తున్నారబ్బా అనుకుంటూ ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూసింది.

గాంధీజీ కర్ర పట్టుకొని నడుచుకుంటూ వస్తున్నాడు.

ఈసారి ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది. చిన్నపుడు పుస్తకాల్లో చూసిన గాంధీ బొమ్మ గుర్తుకు తెచ్చుకుంది. అప్రయత్నంగా 'గాం...ధీ' అన్న మాటలు వెలువడ్డాయి ఆమె నోటి నుండి.

'నిజమే అమ్మాయి నేను గాంధీ తాతనే'

తనకు తెలియకుండానే రెండు చేతులు జోడించింది.

ఆ అమ్మాయిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుందామని అడుగు ముందుకేశాడు. అప్రయత్నంగా ఆ అమ్మాయి రెండడుగులు వెనక్కి వేసింది.

'ఎందుకు తల్లీ నన్ను చూసి వెనకడుగు వేస్తున్నావు. నీ తండ్రి లాంటివాణ్ణి'

'వద్దు... నన్ను తాకొద్దు' పక్కనే ఉన్న చెట్టు వెనక్కి అడుగేసింది.

'అయ్యో నన్ను అర్థం చేసుకో తల్లీ నేను వచ్చింది నీ కోసమే. నాడు చంపారన్‌లో కుష్టు రోగులను సైతం అక్కున చేర్చుకున్నాను. నాకేం ఫరవాలేదు. ఒక్కసారి రామ్మా...'

'వద్దు బాపూ నన్ను తాకి పాపం మూట కట్టుకోకండి. నన్ను తాకితే మీ చేతులు పాప పంకిలాలవుతాయి'

'ఇన్నాళ్ళకి నా కల నిజమయింది. ఈ ఆనందానికి

కారణమైన నిన్ను తాకందే ఇక్కడి నుండి కదలను' స్థిరంగా పలికాడు మహాత్ముడు.

'మీ ఈ ఆనందానికి నేనా కారణం. ఇంతకీ మీ కల ఏమిటి బాపూ?' ఆసక్తిగా అడిగిందా అమ్మాయి.

'అదే తల్లి ఏనాడైతే అర్ధరాత్రి వేళ ఆడపిల్ల స్వేచ్ఛగా తిరగ గలుగుతుందో ఆనాడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లుగా భావించా. ఆ అపురూప దృశ్యం ఈనాడు చూశా. అందుకే ఆ ఆనందం పట్టలేక నిన్ను పలకరించి ఆశీర్వదించి పోదామని వచ్చానమ్మా, కాదనకు'

ఆ మాటలు విన్న ఆమె కళ్ళు అశ్రు పూరితాలయ్యాయి. పిచ్చితండ్రీ ఎంత అమాయకుడివయ్యా అనుకుంది మనసులో. మరోసారి గట్టిగా.

'నన్ను తాకొద్దు బాపూ...'

'అదేవిటి... నువ్వేమన్నా హరిజనురాలివా? అంటే ఇంకా ఈ దేశంలో అంటరానితనం రూపుమాసిపోలేదా?'

'అది కాదయ్యా...'

'మరి ఎందుకు అలా దూరంగా జరుగుతున్నావు?'

ఇక చెప్పక తప్పదని గద్గమైన కంఠంతో చెప్పసాగింది.

'నువ్వనుకున్నట్లు ఈ రాత్రి నేను ఇలా తిరుగుతున్నా నన్నెవ్వరూ తాకడం లేదంటే కారణం వాళ్ళందరికీ నాపైన గౌరవమో, అభిమానమో ఉండి కాదు...'

'మరి...?'

'ఆధునిక మానవుడి వికృత చేష్టలకు ప్రకృతి విధించిన శాపం లాంటి మహమ్మారి వ్యాధి ఒకటి మానవ జాతిని కబళిస్తోంది. అలాంటి వ్యాధి సోకిన అభాగ్యురాలినయ్యా. నన్ను తాకితే తమకు కూడా ఆ వ్యాధి ఎక్కడ అంటుకుంటుందోనన్న భయమే వాళ్ళను నన్ను తాకనివ్వకుండా చేస్తుంది. అంతేకాని వాళ్ళకు నా పట్ల గౌరవమో అభిమానమో ఉండి కాదు'

'ఏమిటా వ్యాధి...?'

'ఎయిడ్స్... నువ్వనుకున్నట్టుగా ఈ దేశంలో ఆడపిల్ల అర్ధరాత్రి వేళ కాదు పట్టపగలు కూడా కాలుబయట పెట్టడానికి వీలు లేనంతగా మానవతా విలువలు పడిపోయాయి. వావి వరసలు కూడా మరచి వయో భేదం కూడా ఎంచక స్త్రీ కనిపిస్తే చాలు కబళించాలని చూసే గోముఖ వ్యాఘ్రాలెన్నో అడ్డూ అదుపూ లేకుండా విహరిస్తున్నాయి.

నాడు పరాయి వాడు మన జాతి మాన ధన ప్రాణాలను కొల్లగొట్టేవాడు. మరి ఈనాడు సొంత మనుషులే అమాయకులను కొల్లగొట్టి పరాయి దేశంలో కోట్లు కూడేస్తున్నాడు. మళ్ళీ విదేశీయులకు స్వాగతం పలుకుతున్నాడు.

ఈ రాత్రికి రాత్రే దేశాన్ని ముక్కలు ముక్కలుగా చేసి పరాయి వాళ్ళకు అమ్మడానికి సిద్ధంగా తార్పుడుగాళ్ళెందరో పొంచి ఉన్నారు. మీరు జీవితాల్ని పణంగా పెట్టి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగ పరుస్తున్నారు బాపూ' ఇంక మాట్లాడలేక పోయింది.

అచేతనుడై వింటున్న గాంధీజీ కళ్ళ నుండి అశ్రుధారలు స్రవిస్తున్నాయి.

'హేరామ్...' అన్న మాట మాత్రం వెలువడింది.

గాడ్సే తుపాకి గుండు అవసరం లేకుండానే మహాత్ముడు నేల కొరిగాడు.

దూరంగా కపోతం కన్నీరు కార్చింది. ★

# బట్టతలకు మందొచ్చేసింది

బట్టతల మేధస్సుకు చిహ్నమని, మేధావులకే బట్టతల వస్తుందని ఒకప్పుడు అనుకునేవారు. కాని నేడు అదే బట్టతల అంద వికారమై పోయింది. వయసుతో నిమిత్తం లేకుండా బట్టతలతో బాధపడేవారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఎన్నో కంపెనీలు జుట్టు మొలిపిస్తామంటూ ఎన్నో రకాల తలనూనెలు ఉత్పత్తి చేసినా అవి సరైన ఫలితాన్ని ఇవ్వలేక పోయాయి. దాంతో హెయిర్ వీవింగ్, ట్రాన్స్‌ప్లాంటేషన్‌లు అమలులోకి వచ్చాయి. ఇవి ఖర్చుతో కూడుకున్నవి కావడంతో సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. కానీ మొత్తానికి శాస్త్రవేత్తల కృషి ఫలించింది. బట్టతలకు మందొచ్చేసింది.

శిరోజాల పెరుగుదలకు కారణమైన హోమోసన్ మాత్రమే బట్టతలకు సరైన మందు అని అంగీకరించడంతో సాయిక్రాఫ్ట్ కంపెనీ లిమిటెడ్ వారు భారతదేశంలో ఈ మందును విడుదల చేయడానికి కావలసిన హక్కులు పొందారు. స్విట్జర్లాండ్ నుంచి ఇండియాకు హోమోసన్ దిగుమతి కావడం వెనుక చంద్రమోహన్ అరోరా గణనీయమైన కృషి ఉంది. కుటుంబ సభ్యులలో ఒకరు జుట్టంతా ఊడిపోయి బాధ పడుతుండటంతో మంచి మందు కోసం చంద్రమోహన్ అరోరా స్విట్జర్లాండ్ పయనమయ్యారు. అక్కడ హోమోసన్ గురించి తెలుసుకున్నారు. శిరోజాల ఎదుగుదలకు కావలసిన పోషక పదార్థాలను అందించి జుట్టు పెరుగుదలకు దోహదం చేసే హెయిర్ న్యూట్రియంట్‌గా హోమోసన్‌ను అక్కడి వారు అభివర్ణించడంతో ఆయనకు పూర్తి వివరాలు తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగింది. దానిని వాడిన వారంతా సంతృప్తిగా ఉన్నారని, ఫలితాలు ఆశించిన మేర పొందారని తెలుసుకున్న ఆయన భారతదేశంలో ఉత్పత్తి చేయాలని సంకల్పించారు. ఆ విధంగా హోమోసన్ భారతదేశాన్ని చేరింది. ఫ్రాన్స్, కెనడా, జర్మనీ, అమెరికా, ఆఫ్రికాలు హోమోసన్‌ను తయారుచేస్తున్నా పుట్టినిల్లు మాత్రం ఇటలీ. 1936లోనే ఇటలీవారు హోమోసన్‌ను కనుగొన్నారు. ఈ మందును వాడటంవల్ల ఆరువారాలలోనే ఫలితం కన్పిస్తుంది. మొదట జుట్టు ఊడిపోవడం తగ్గిపోతుంది. నాలుగు నెలల తర్వాత జుట్టు పెరగ నారంభిస్తుంది. పూర్తిగా జుట్టు ఊడిపోయిన వారు కనీసం ఆరునెలల పాటు ఈ మందును వాడాల్సి ఉంటుంది. 180 టాబ్లెట్స్ ధర 2,500 రూపాయలు.

శిరోజాల కుదుళ్ళు బలంగా ఉంటే జుట్టు ఊడిపోకుండా ఉంటుంది. కుదుళ్ళ గట్టితనానికి దోహదం చేసే అమైనో ఆసిడ్స్ ఉత్పత్తి తగ్గిపోతే జుట్టు ఊడిపో నారంభిస్తుంది. ఇందుకు శారీరక అనారోగ్యం, టెన్షన్స్, డిప్రెషన్స్‌ను కారణంగా చెప్పుకోవచ్చు. శరీరంలోని ఇతర భాగాల వలెనే శిరోజాలు కూడా ప్రోటీన్స్, అమైనో ఆసిడ్స్‌తో తయారుచేయబడినా ఈ రెంటి కంపోజిషన్ మాత్రం భిన్నంగా ఉంటుంది. పైన చెప్పిన కారణాల వల్ల కుదుళ్ళకు అవసరమైనంత వరకూ అమైనో ఆసిడ్స్ ఉత్పత్తి జరగదు. ఫలితంగా శిరోజాలు బలహీనమవుతాయి. నెమ్మదిగా ఊడిపోతాయి. హోమోసన్ కాస్మొటిక్ కాదు. ఇది కేవలం శిరోజాలకు కావల్సిన పోషక పదార్థాలు అందించే ఔషధం. అందువల్ల ఇతర మందుల్లా వెంటనే ఫలితం కన్పించదు. కాని ఆరు వారాలలోనే మీ పరిస్థితిలో మార్పు వస్తుందని, దీనితోపాటుగా పోషకాహారం తీసుకుంటూ టెన్షన్స్‌ను అదుపులో ఉంచుకునే ప్రయత్నాలు చేస్తే సత్వరమే ఫలితాలు సాధించవచ్చని చంద్రమోహన్ అరోరా చెప్పున్నారు. హోమోసన్‌లో ఉండే 'కిరాటిన్ హైడ్రోలైసేట్' జుట్టు పెరగడానికి దోహదం చేస్తుంది. కురు స్వభావం, బట్టతల తీవ్రతను బట్టి హోమోసన్ వాడటం మొదలుపెట్టిన మూడు నుంచి ఆరునెలలలోపు దీని ప్రభావం కన్పిస్తుంది.

–కల్లూరి శైలబాల

# రచయితలకు సూచనలు

ఆదివారం ఆంధ్రభూమికి తమ రచనలు పంపేవారు ఈ కింది సూచనలను విధిగా పాటించాలి.

★ రచయితలు తమ రచనలు పంపే కవర్లపై 'ఆదివారం ఆంధ్రభూమి' అని పేర్కొంటూ, శీర్షిక పేరు కూడా రాయాలి.

★ విలువైన ఫొటోలు, సమాచారం ఉన్న కవర్లను కొరియర్ ద్వారా పంపితే మంచిది.

★ పాఠకులకు ఆసక్తికరమైన సచిత్ర వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది.

★ పేపర్ కటింగ్‌లు కాకుండా వీలయినంత వరకు ఒరిజినల్ ఫొటోలే పంపాలి.

★ ప్రచురించిన ప్రతి ఆర్టికల్‌కు తగిన పారితోషికం ఉంటుంది కనుక రచయితలు తమ చిరునామాను స్పష్టంగా తెలియజేయాలి.

★ కథలు అచ్చులో రెండు పేజీలకు మించరాదు.

★ వివిధ అంశాలకు సంబంధించిన వ్యాసాలన్నీ రెండు అరఠావులకు మించకుండా ఉంటే మంచిది.

★ వినేసిన జోక్‌లు, చూసేసిన కార్టూన్లు కాకుండా కొత్త వాటినే పంపాలి.

★ వివిధ పత్రికల నుంచి సేకరించే అనువాదాల విషయమై వచ్చే వివాదాలకు రచయితలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

రచనలు పంపాల్సిన చిరునామా
ఎడిటర్,
ఆంధ్రభూమి (ఆదివారం అనుబంధం)
36, సరోజినీ దేవి రోడ్, సికిందరాబాద్.